సాక్షి పెద్దపల్లి

గురువారం । 3 । ఏప్రిల్ । 2025



శ్రీసీతారాముల పట్టాభిషేకం

జూలపల్లి: నాలుగు రోజులుగా కుమ్మరికుంటలో నిర్వహిస్తున్న చిడతల రామాయణంలో చివరి ఘట్టం శ్రీసీతారాముల పట్టాభిషేకం బుధవారం కన్నుల పండువగా జరిగింది.



పోలీస్‌స్టేషన్ సందర్శన

రామగుండం: అంతర్గాం పోలీస్‌స్టేషన్‌ను పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, కేసుల వివరాలపై ఆయన ఆరా తీశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటివేళ ఉక్కపోతగా ఉంటుంది. పలు చోట్ల చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గ్రూప్–1 ర్యాంకర్‌కు కలెక్టర్ అభినందన



అరుణ్ కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్/మంథని: మంథని మండలం ఖాన్‌సాయిపేటకు చెందిన గ్రూప్ – 1 ర్యాంకర్ జక్కుల అరుణ్‌కుమార్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం అభినందించారు. అరుణ కుమార్ రాష్ట్రస్థాయిలో 114వ ర్యాంక్, మల్టీజోనల్–1 స్థాయిలో 64వ ర్యాంక్ సాధించడంపై కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్, తల్లిదండ్రులు మల్లేశ్వరి – లక్ష్మీనారాయణతో పాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా



ఎస్‌ఈని సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

సుల్తానాబాద్(పెద్దపల్లి): వేసవిలో వినియోగదారులకు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ మాధవరావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ వినియోగిస్తున్న లబ్ధిదారులు కరెంట్‌ను వృథా చేయొద్దన్నారు. అనంతరం ఎస్‌ఈని సన్మానించారు. అధికారులు రవికుమార్, ప్రభాకర్, ఏడీఈ శ్రీనివాస్, సుగుణయ్య, ఏఈలు కిశోర్, బొంకూరి రవీందర్, సంపత్, శంకరయ్య, సైఫొద్దీన్, మాధవరావు, శంకరయ్య, సుధాకర్, కొమురయ్య, లక్ష్మయ్య, శ్రీనివాస్, వీరయ్య, శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పాపన్నగౌడ్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న అధికారులు ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. సర్వాయి పాపన్న ఆశయ సాధనకు పాటుపడాలని ఆయన కోరారు. సహాయ బీసీ అభివృద్ధి అధికారి, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు ఎం.అంజయ్యగౌడ్, ప్రతినిధులు బాలసాని వెంకటేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

232 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం పత్తి క్వింటాలుకు గరిష్ఠంగా రూ.7,241 ధర పలికింది. కనిష్ఠంగా రూ.5,111, సగటు రూ.7,044గా ధర నమోదైందని మార్కెట్ కార్యదర్శి మనోహర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన పలువురు రైతుల నుంచి 232 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్టీపీసీ కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శోభన్‌బాబు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రెండో తరగతిలో 13, నాలుగో తరగతిలో–07, ఐదో తరగతిలో–19, ఆరో తరగతిలో–15, ఏడో తరగతిలో–18, ఎనిమిదో తరగతిలో –22, తొమ్మిదో తరగతిలో –09 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు విద్యాలయంలో రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు దరఖాస్తు చేయాలని, ఈనెల 11వ తేదీ వరకు గడువు ఉందన్నారు. అర్హుల జాబితాను ఈనెల 17న విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.

గడువు పొడిగింపు

పెద్దపల్లిరూరల్: ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ సామాజిక వర్గాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల దాఖలుకు ఈనెల 14వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి తెలిపారు. అర్హులైన, ఆసక్తిగల అభ్యర్థులు గడువులోగా https://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 08728–222266, 79933 57097 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

భరోసా ఏది?

- పంటలు కోతకు వచ్చినా స్పష్టత కరువు
- పెట్టుబడి కోసం నిరీక్షిస్తున్న అన్నదాతలు

జిల్లా సమాచారం

పట్టా భూమి(ఎకరాల్లో)	2,78,555
సాగుయోగ్యమైనది(ఎకరాల్లో)	2,75,899
రైతుల సంఖ్య	1,61,032
మొత్తం పెట్టుబడి సాయం	165.53 (రూ.కోట్లలో)
ఇప్పటివరకు ఖాతాల్లో జమైంది	82.57 (రూ.కోట్లలో)
సాయం పొందిన రైతుల సంఖ్య	1,14,313



సాక్షి, పెద్దపల్లి: సాగు పెట్టుబడి కోసం ప్రవేశపెట్టిన రైతుభరోసా అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు, నాట్లువేసే సమయంలో ఇవ్వాల్సిన రైతుభరోసాను పంటలు కోతకు వచ్చినా విడుదల చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగు మొదట్లోనే బ్యాంకు ఖాతాల్లో జమచేస్తే ఎరువులు, కూలీలు తదితర ఖర్చులకు ప్రభుత్వం ఇచ్చే పైసలు ఉపయోగపడేవి. విడుదలతో అలస్యంతో రైతులపై అప్పులు, వడ్డీభారం పడుతోంది. సాగుకు యోగ్యమైన భూములకే రైతుభరోసా ఇస్తామని జనవరి 26న రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వం.. విడతల వారీగా మార్చి 31వ తేదీ వరకు పలువురు రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని చెప్పింది. అయినా, ఇప్పటివరకు వారి ఖాతాల్లో డబ్బులు పడలేదని, పడుతాయో లేదోనని రైతులు వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

2,665 ఎకరాలకు రైతుభరోసా కట్

రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇటుకబట్టీలు తదితర సాగులో లేనిభూములకు గత ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ ద్వారా అనుసంధానించిన పట్టా కలిగిన భూములను వ్యవసాయశాఖ అధికారులతో సర్వే చేయించింది. ఇందులో జిల్లాలో 2,78,555 ఎకరాలకు పట్టా ఉండగా, అందులో 2,655.32 ఎకరాలు సాగులో లేవని గుర్తించారు. కేవలం 2,75,899 ఎకరాలు సాగులో ఉన్నాయని, వాటికి 1,61,032 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.165.53కోట్లు జమచేయాల్సి ఉందని తేల్చారు.

మూడెకరాలు.. ఐదు విడతలు

గత యాసంగి నుంచి ఎకరాకు రూ.6వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. ఇందులో భాగంగా తొలుత జనవరి 27న పైలెట్ గ్రామాల్లోని రైతుల ఖాతాల్లో నిధులు జమచేశారు. ఫిబ్రవరి 5న ఎకరం ఉన్న రైతులకు, 10న రెండెకరాలు, 12న మూడెకరాల్లోపు భూములు ఉన్న రైతులకు నిధులను విడుదల చేసింది. ఆపై భూమి కలిగిన వారి ఖాతాల్లో ఇప్పటివరకు పైసలు పడేలేదు. ఇప్పటివరకు 1,14,313 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.82.57కోట్లు జమచేశారు. ఇంకా సుమారు 45వేల మందికిపైగా రైతుల బ్యాంకు ఖాతాల్లో దాదాపు రూ.51కోట్ల వరకు జమచేయాల్సి ఉంది. ఇదే విషయమై డీఏవో ఆదిరెడ్డిని సంప్రదించగా.. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే రైతుల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ అవుతాయన్నారు.

కోతలు దగ్గర పడ్డాయి



నాకు 4.10 ఎకరాలు ఉంది. పెట్టుబడి కోసం ప్రవేశపెట్టిన రైతుభరోసా పైసలు ఇంకా పడలేదు. పంట కోతలు దగ్గరపడ్డా పైసల కోసం ఎదురుచూపులే మిగిలాయి. ప్రభుత్వం పైసలు జమచేస్తే కోతలు, కూలీల అవసరాలకు ఉపయోగపడతాయి.

– ముత్యాల తిరుమలరెడ్డి, బొమ్మరెడ్డిపల్లి

డబ్బులు పడలేదు



ప్రభుత్వం ప్రకటించిన రైతుభరోసా డబ్బులు ఇప్పటివరకు పడలేదు. మూడు ఎకరాల్లో పంటలు వేసిన. ఇంతవరకు పైసలు పడలేదు. రైతుభరోసా ఎప్పుడు పడుతుందోనని బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుడు అవుతుంది.

– టి.రాజారాం, రైతు, ఓదెల

పైసలు రాలేదు



ఇప్పటి వరకు రైతు భరోసా అందలేదు. మరోవారం, పదిరోజులైతే పంటలు కోతకు వస్తాయి. గత సీజన్‌లో రైతు భరోసా వేయలేదు. ఈ సీజన్‌లో భరోసా వేసినా.. కొంతమంది రైతులకే వచ్చాయి. నాలాంటి రైతులకు సైతం ఖాతాల్లో డబ్బులు జమ చేస్తే కోతలకు పనికి వస్తాయి.

– అప్పల రాజయ్య, రైతు, కదంబపూర్

పేదలకు సరిపడా సన్నబియ్యం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సరిపడా సన్నబియ్యం సరఫరా చేస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ రేషన్ దుకాణంలో బుధవారం తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీని ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 413 రేషన్‌దుకాణాల ద్వారా ప్రతీనెల సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఇందుకోసం 4 లక్షల క్వింటాళ్ల బియ్యం అందుబాటులో ఉంచామని తెలిపారు. జిల్లా అవసరాలు తీర్చడంతోపాటు ఆసిఫాబాద్ జిల్లాకు కూడా ఎగుమతి చేశామని వెల్లడించారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, పెద్దపల్లి నియోజకవర్గంలోని 55 రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఆర్డీవో గంగయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, డీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. నిట్టూరులో రూ.20లక్షల వ్యయంతో చేపట్టిన కల్వర్టు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు.



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, పక్కన ఎమ్మెల్యే విజయరమణారావు

పేదల సంక్షేమమే ధ్యేయం

జూలపల్లి(పెద్దపల్లి): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా, పేదల కడుపునింపేందుకే సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు అన్నారు. జూలపల్లి మండలం కాచాపూర్, కుమ్మరికుంటలో అదనపు కలెక్టర్ వేణు, డీఎస్‌వో రాజేందర్, ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ స్వర్ణతో కలిసి ఆయన సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. నాయకులు గండు సంజీవ్, వేణుగోపాలరావు, రమాదేవి, నర్సింహాయాదవ్ తదితరులు ఉన్నారు.

తెల్లరేషన్‌కార్డుదారులకు..

ఎలిగేడు(పెద్దపల్లి): పేదల కడుపునింపేందుకే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఎలిగేడు మండలం ధూళికట్ట, ఎలిగేడులో తెల్లరేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి మాట్లాడారు. అధికారులు రాజేందర్, గంగయ్య, బషీరొద్దీన్, భాస్కర్‌రావు, జయలక్ష్మి, పున్నమయ్య, అంజలి, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, సామ రాజేశ్వర్‌రెడ్డి, బాలుసాని పరుశరాములుగౌడ్, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పథకంపై పీఎం ఫొటో పెట్టాలి

- బీజేపీ శ్రేణుల డిమాండ్

పెద్దపల్లిరూరల్: పేదలకు పంపిణీ చేసే బియ్యం పథకంపై ప్రధానమంత్రి ఫొటో ముద్రించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో వారు నిరసన తెలిపారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాకేశ్‌తోపాటు నాయకులు రాజ్‌గోపాల్, పిట్టల వినయ్ తదితరులు.. పీఎం ఫొటో కూడా ముద్రించాలని డిమాండ్‌చేశారు. అయితే, వారు లోనికి చొచ్చుకు వెళ్లకుండా సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్‌రావు, మల్లేశ్ అడ్డుకున్నారు. ‘ఈ విషయమై మీ విన్నపాన్ని కలెక్టర్ ఇవ్వండి.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారు’ అని ఎమ్మెల్యే విజయరమణారావు వారికి నచ్చజెప్పారు. అంతేకాదు.. ‘రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలు, అందులో ఇద్దరు మంత్రులుగా ఉండీ ఏం లాభం.. రాష్ట్రాభివృద్ధికి నిధులు సాధించలేక పోయారు.. అదే పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం నలుగురే ఉన్నా నిధుల వరద పారించార’ని ఎమ్మెల్యే విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిధులు తెచ్చేందుకు పోరాడాలే.. తప్ప గీ బియ్యం పథకం కాడ ఫొటో కోసం కాదని హితవు పలికారు. అయినా, మన ప్రధానే.. ఆయనను గౌరవించుకుందామని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే నచ్చజెప్పి వెళ్లిపోయారు.



నచ్చజెప్పుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్..

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని దుర్గానగర్‌కాలనీ బోర్డు ఎదుట ప్రధాన రహదారిపై ఏర్పడిన వాటర్ పైప్‌లైన్ లీకేజీలకు బుధవారం బల్దియా సిబ్బంది మరమ్మతు చేశారు. ‘లీకేజీ.. ఈ పరేషాన్ ఏమిటి?’ శీర్షికన బుధవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్ కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ స్పందించారు. వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు సిబ్బందితో లీకేజీలకు మరమ్మతు చేయించారు. ‘సాక్షి’ చొరవను స్థానికులు అభినందించారు.



ముగిసిన టెన్త్ పరీక్షలు

పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారం ముగిశాయి. ఇన్నిరోజులూ పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఆఖరి పరీక్ష రాసిన అనంతరం పరీక్ష కేంద్రంలోంచి బయటక వచ్చి ఒక్కసారిగా ఎగిరి గంతులేశారు. మళ్లీ ఎప్పుడు, ఎలా కలుస్తామోనంటూ విద్యార్థులు తమ మొబైల్‌నంబర్లు సేకరించి బైబై చెప్పుకొని తమ ఇళ్లకు పయనమయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఆధునిక హంగులేవి?



“ పెద్దపల్లి పాతకోర్టు(అమర్‌నగర్) కూడలి ఇది. గతేడాది మున్సిపల్ అధికారులు ఆకట్టుకునే ఆకృతులతో సుందరీకరించారు. కొద్ది నెలల పాటు రంగురంగుల విద్యుత్ దీపకాంతుల మధ్య వాటర్ ఫౌంటేన్ విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు, యువకులు అక్కడకు చేరి సెల్ఫీలు తీసుకున్నారు. ఆ తర్వాత నిర్వహణను విస్మరించడంతో ఆ ఆకృతులు కనిపించకుండా వివిధ రాజకీయ పార్టీలు ఇలా జెండాలతో తోరణాలు కట్టేశాయి.



జిల్లా తొలికలెక్టర్ వర్షిణి ప్రత్యేక శ్రద్ధతో నిర్మించిన సుందరమైన ఆకృతులు పట్టణ ప్రజలకు కొద్దిరోజులపాటు ఆహ్లాదం పంచాయి. ఆ తర్వాత చిరువ్యాపారులు వాటి ఎదుటే క్రయవిక్రయాలు ప్రారంభించడం, రాజకీయ నేతలు తమ ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేయడంతో ఆకృతులు కనిపించకుండాపోతున్నాయి.



ఇది జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్దగల అంబేద్కర్ విగ్రహం. దీనిచుట్టూ గార్డెన్‌తో పాటు ఫౌంటేన్ నిర్మించారు. నీటికోసం ఏకంగా బోరు వేయించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా.. నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో ఫౌంటేన్ పగుళ్లు చూపింది. రాజీవ్ రహదారిని ఆనుకుని ఉంది. నిత్యం రద్దీగా ఉంటుంది. రంగురంగుల విద్యుత్ దీపాలు అమర్చి, ఫౌంటేన్‌ను తీర్చిదిద్దితే ఆకట్టుకునేలా ఉంటుంది.

- జిల్లాకేంద్రం హోదాకు తూగని అభివృద్ధి
- ప్రధాన కూడళ్ల సుందరీకరణపై నిర్లక్ష్యం
  పాతవాటిని పట్టించుకోరు
- పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని ప్రధాన కూడళ్ల దుస్థితి

గ్రౌండ్ రిపోర్ట్

పెద్దపల్లిరూరల్: అనూహ్యంగా జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన ‘పెద్ద’పల్లి.. ఆ హోదాకు తగిన విధంగా అభివృద్ధికి నోచుకోక ‘చిన్న’బోతోంది. తొలి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అలుగు వర్షిణి.. పట్టణంలోని ఆరు ప్రధాన కూడళ్లను ఎంపిక చేసి సుందరీకరించాలని నిర్ణయించారు. అంతేకాకుండా అధికారుల బృందాన్ని ముంబయికి పంపించి అక్కడి ప్రధాన కూడళ్ల సుందరీకరణపై అధ్యయనం చేయించారు.

అధికారుల సూచనలతో..

ముంబయిలో కూడళ్ల అధ్యయనం చేసిన అధికారుల సూచనల ప్రకారం.. పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద సుందరీకరణ పనులు పూర్తిచేసి వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు చేయించారు. ఆ తర్వాత పాతకోర్టు(అమర్‌నగర్) ప్రాంతంలో మరో కూడలిని సుందరీకరించారు. మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలోనే బస్టాండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం చుట్టూ వాటర్ ఫౌంటేషన్ ఏర్పాటు చేశారు. దీనికి అవసరమైన నీటికోసం ఏకంగా ఓ బోరు వేయించారు. కానీ ఇవేవీ రాత్రి సమయాల్లో పనిచేయక పోవడంతో పట్టణ ప్రజలు నిరాశ చెందుతున్నారు.

రూ.లక్షలు వెచ్చించినా..

రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు ప్రజలకు.. ముఖ్యంగా చిన్నారులు, యువత, మహిళలకు ఆనందం, ఆహ్లాదం పంచేలా చూడాల్సిన మున్సిపల్ అధికారులు.. నిర్వహణ వైఫల్యంతోనే ప్రధాన కూడళ్లు కళావిహీనంగా మారాయనే విమర్శలు ఉన్నాయి. ప్రధాన జెండా కూడలి, చాకలి ఐలమ్మ, అమర్‌నగర్, ప్రగతినగర్ ప్రధాన కూడళ్ల సుందరీకరణ ఊసే లేదు.

సుందరీకరించాలి



పెద్దపల్లి పట్టణంలోని ప్రధాన కూడళ్లను సుందరీకరించాలి. పట్టణ శోభ ఉట్టిపడేలా విద్యుత్ దీపాలు, ఫౌంటేన్‌లను ఏర్పాటు చేయాలి. అధికారులు ఈ దిశగా ప్రత్యేక చొరవ చూపాలి.

– మిట్టపల్లి శ్రీనివాస్, పెద్దబొంకూర్

ఆహ్లాదం పంచాలి



పట్టణ ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఆహ్లాదం పంచేలా ప్రధాన కూడళ్లను తీర్చిదిద్దాలి. ఇప్పటికే పూర్తయిన కూడళ్లను రాత్రి సమయాల్లో వెలుగులతో విరజిమ్మేలా ఏర్పాట్లు చేయాలి.

– తంగెడ రాజేశ్వర్‌రావు, బీజేపీ నాయకుడు

ప్రతిపాదనలు ఉన్నాయి



ప్రధాన కూడళ్లను సుందరీకరించే పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలున్నాయి. దశలవారీగా వాటిని ఆధునీకరిస్తాం. మినీ ట్యాంక్‌బండ్‌తోపాటు ఇప్పటికే పూర్తయిన కూడళ్ల ప్రజలకు ఆహ్లాదం, ఆనందం పంచేలా చర్యలు తీసుకుంటున్నాం. – వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్

టార్గెట్ 76 మిలియన్ టన్నులు

- 2025–26లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం
- అత్యధికం కొత్తగూడెం ఏరియాకు..
- నైనీబ్లాక్ నుంచి 4 మిలియన్ టన్నులు
- వార్షిక నివేదిక విడుదల చేసిన సింగరేణి యాజమాన్యం

గోదావరిఖని: సింగరేణి సంస్థ 2025–25 ఆర్థిక సంవత్సరం వార్షిక లక్ష్యం నివేదికను విడుదల చేసింది. ఈసారి 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని నిర్దేశించింది. ఇందులో సింహభాగం.. 15.7 మిలియన్ టన్నులు కొత్తగూడెం ఏరియాకు కేటాయించింది. ఆ తర్వాతి స్థానంలో మణుగూరు ఏరియా ఉంది. అత్యల్పంగా అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టుకు 1.5 మిలియన్ టన్నులు కేటాంచారు.

నైనీబ్లాక్ ద్వారా 4 మిలియన్ టన్నులు



సింగరేణి భవన్

సింగరేణి సంస్థకు చెందిన ఒడిశాలోని నైనీబ్లాక్‌లో ఈ ఆర్థిక సంవత్సరం ఉత్పత్తి లక్ష్యాన్ని భారీగా నిర్దేశించింది. బ్లాక్ ద్వారా 4 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీయాలని నిర్ణయించింది. వాస్తవానికి గత ఆర్థిక సంవత్సరంలోనే బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తామని ప్రకటించినా.. సాంకేతిక కారణాలతో అది సాధ్యం కాలేదు.

ఏరియాల వారీగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం(మిలియన్ టన్నుల్లో)

ఏరియా	2025–26
కొత్తగూడెం	15.70
ఇల్లెందు	5.00
మణుగూరు	11.50
బెల్లంపల్లి	3.50
మందమర్రి	2.80
శ్రీరాంపూర్	6.50
ఆర్జీ–1	4.49
ఆర్జీ–2	9.90
ఆర్జీ–3	6.50
అడ్రియాల	1.50
భూపాలపల్లి	4.70
నైనీ	4.00

ఆధునిక యంత్రాల వైపు రైతుల చూపు

- పరికరాలకు అందని సబ్సిడీ
- రాయితీ ఉంటే మరింత మందికి చేరువ
- ఇటీవల కేంద్రం నుంచి ఉమ్మడి జిల్లాకు రూ.2.61 కోట్లు



సబ్సిడీపై ఇచ్చే ప్లవ్



డ్రోన్

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ రంగం రోజురోజుకూ శాస్త్ర, సాంకేతికతను సంతరించుకుంటూ ముందుకెళ్తోంది. ఒకప్పటి నాగళ్లు, కొడవళ్లు మూలకు పడ్డాయి. వాటి స్థానంలో ట్రాక్టర్లు, డ్రోన్లు వంటి ఆధునిక యంత్రాలు వచ్చాయి. ట్రాక్టర్ల తోపాటు వాటికి ఉపయోగించే పరికరాల ధరలు ఆకాశానికి ఎగబాకాయి. దీంతో సామాన్య రైతులు కొనలేని పరిస్థితి ఏర్పడింది.

ఆధునిక యంత్రాలపై ఆధారం

మనిషి శ్రమ లేకుండా.. తేలికగా యంత్రాలతో వ్యవసాయ పనులు చేయాలని రైతులు ఆలోచిస్తున్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగా ఆధునాతన యంత్రాలు కూడా రూపుదిద్దుకుంటున్నాయి. ఒకప్పుడు గ్రామానికి రెండుమూడు ట్రాక్టర్లు ఉంటే గొప్ప. అలాంటిది ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు వచ్చాయి. రైతులకు బ్యాంకులు ఈఎంఐ పద్ధతిలో రుణ సహాయం చేస్తుండటంతో ట్రాక్టర్లు కొనుగోలు చేస్తున్నా వాటికి బిగించే పరికరాలకు మాత్రం రుణ సహాయం అందించడం లేదు. ఫలితంగా చిన్న, సన్నకారు రైతులు యంత్ర పరికరాల కోసం ప్రభుత్వ సబ్సిడీ కోసం ఎదురు చూస్తున్నారు. వ్యవసాయానికి వినియోగించే ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, సీడ్ ప్లాంటేషన్, రోటోవేటర్, గడ్డిని కట్టలుకట్టే మిషన్లు, కేజీవీల్స్ వంటి పరికరాలను సబ్సిడిపై అందించాలని రైతులు కోరుతున్నారు.

స్మామ్ పథకం రైతులకు వరం

ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద వ్యవసాయ యాంత్రీకరణ పథకం (స్మామ్) ద్వారా ఉమ్మడి జిల్లాకు రూ 2.61కోట్లు కేటాయించింది. వీటి ద్వారా సన్న, చిన్న కారు రైతులతోపాటు మహిళా రైతులకు బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్స్, రసాయన మందులు పిచికారీ చేసే డ్రోన్‌లు, రోటోవేటర్లు, ఎరువులు, విత్తనాలు ఒకేసారి వేసే సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్, కల్టివేటర్లు, బండ్ ఫార్మర్ (పొలం మధ్య గట్లను పోసే యంత్రం), పవర్ వీడర్, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్లు, స్ట్రా బాలర్స్‌ను అందించాలని నిర్ణయించారు. సన్న, చిన్నకారు రైతులకు 40శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. ఇందుకోసం మండల వ్యవసాయాధికారి కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తులను మండల పరిధిలోని తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయాధికారి పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

రాయితీపై ఇచ్చే పరికరాలు

రాయితీపై ఇచ్చే పరికరాలు తక్కువగా ఉండటం, దరఖాస్తులు ఎక్కువగా వస్తుండటంతో అధికారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. బ్యాటరీ స్ప్రేయర్స్ కరీంనగర్‌కు 94, జగిత్యాలకు 101, రాజన్న సిరిసిల్లకు 64, పెద్దపల్లికి 75, పవర్ స్ప్రేయర్స్ కరీంనగర్‌కు 94, జగిత్యాలకు 102, రాజన్న సిరిసిల్లకు 64, పెద్దపల్లికి 76, రోటోవేటర్లు కరీంనగర్‌కు 55, జగిత్యాలకు 51, రాజన్న సిరిసిల్లకు 24, పెద్దపల్లికి 35, కల్టివేటర్లు కరీంనగర్‌కు 63, జగిత్యాలకు 67, రాజన్న సిరిసిల్లకు 29, పెద్దపల్లికి 34 మంజూరయ్యాయి. ప్రతి జిల్లాకు ఒక్కటి చొప్పున డ్రోన్, మూడు చొప్పున ట్రాక్టర్లు మంజూరయ్యాయి. ఇంకా సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ కరీంనగర్‌కు 9, జగిత్యాలకు 12, సిరిసిల్లకు 4, పెద్దపల్లికి 6 మంజూరయ్యాయి. ఉమ్మడి జిల్లాకు బండ్ ఫార్మర్ 10, పవర్ వీడర్ 7, బ్రష్ కట్టర్ 17, పవర్ టిల్లర్ 10, స్ట్రాబాలర్స్ 9 మంజూరు కాగా ఆయా జిల్లాలకు 2,3 చొప్పున ఇవ్వనున్నారు.

50 శాతం సబ్సిడీ ఇచ్చే పరికరాలు

యంత్రం	ధర
ట్రాక్టర్	రూ.4లక్షల నుంచి రూ.13లక్షలు
డ్రోన్	రూ.10లక్షలు
రోటోవేటర్	రూ.90వేల నుంచి రూ.1.90లక్షలు
ఎంబీ ప్లవ్	రూ.50వేల నుంచి రూ.1.40లక్షలు
కల్టివేటర్	రూ.36వేల నుంచి రూ.50 వేలు
డిస్క్ కల్టివేటర్	రూ.40వేల నుంచి రూ.50 వేలు
బండ్ ఫార్మర్	రూ.40వేల నుంచి రూ.3.50లక్షలు
రోటో పడ్లర్	రూ.26వేల నుంచి రూ.1.60లక్షలు
పవర్ టిల్లర్	రూ.2లక్షల నుంచి రూ.2.40లక్షలు
సీడ్‌కమ్ ఫర్టిలైజర్ డ్రిల్	రూ.46వేల నుంచి రూ.60లక్షలు
పవర్ స్ప్రేయర్	రూ.20వేలు
పవర్ వీడర్	రూ.60లక్షల నుంచి రూ.80లక్షలు
బ్రష్‌కట్టర్	రూ.40వేల నుంచి రూ.88వేలు
స్ట్రాబేలర్స్	రూ.4లక్షల నుంచి రూ.4.40 లక్షలు
మేజ్ షెల్లర్స్	రూ.66లక్షల నుంచి రూ.2.20లక్షలు

(ట్రాక్టర్లు, డ్రోన్‌లు పొందాలంటే తప్పనిసరిగా 2.5 ఎకరాల భూమి ఉండాలి)

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం



కొన్నేళ్లుగా సబ్సిడీపై యంత్ర పరికరాలు సరఫరా చేయలేదు. ఇప్పుడు దరఖాస్తు చేసుకుందామంటే జిల్లాకు ఒక్కటి రెండు పరికరాలు మాత్రమే ఉన్నాయి. మండలానికి ఒక్క పరికరం కూడా వచ్చేలా లేదు. రైతులకు అవసరమైన పరికరాలకు సబ్సిడీ వర్తింజేయాలి.

– చీటేటి జీవన్‌రెడ్డి, తొంబర్రావుపేట, మేడిపల్లి మండలం

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం



యంత్ర పరికరాల స్కీం కింద దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ప్రతి మండలానికి భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. జిల్లా, మండల లెవల్ కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేస్తాయి. లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న యంత్రం ధరలో 50 శాతం సబ్సిడీ లభిస్తుంది.

– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి, జగిత్యాల

పంచ్ కొడితే పతకమే

- అంతర్జాతీయ కరాటే పోటీల్లో గ్రామీణ విద్యార్థిని ప్రతిభ
- మలేషియా ఇంటర్నేషనల్ పోటీలకు హాసిని ఎంపిక
- వరల్డ్ చాంపియన్‌లో దేశానికి మెడల్ తేవడమే లక్ష్యం



మధ్యప్రదేశ్‌లో గోల్డ్‌మెడల్ అందుకుంటున్న హాసిని



శిక్షణపొందుతున్న హాసిని

ముత్తారం(మంథని): ఆమె గ్రామీణ విద్యార్థిని.. ఆర్థిక సమస్యలున్నా కరాటే పోటీల్లో పంచ్ కొడితే పతకం సాధించాలనే తపనతో ప్రతిభకు పదును పెడుతోంది. ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి మే నెలలో మలేషియాలో దేశంలో జరిగే ఇంటర్నేషనల్ కరాటే పోటీలకు ఎంపికైంది మెట్టు హాసిని.

పోటీ పడితే పతకం సాధించడమే..

మంథనికి చెందిన మెట్టు దేవి – నర్సింగం దంపతులకు ఇద్దరు కూతుర్లు. పెద్ద కుతూరు మానసకు వివాహం అయ్యింది. చిన్నకుతూరు హాసిని మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు మంథని బాలికల హైస్కూల్‌లో చదివింది. ముత్తా రం మండలం ధర్య పూర్ మోడల్ స్కూల్‌లో ఇంటటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రా సింది. నాలుగో తరగతిలోనే సీనియర్ల ను చూసి కరాటే నే ర్చుకోవడమే కాదు.. అందులో రాణించాలని కంకణం కట్టుకుంది. ఇలా ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతూనే కరాటేలో శిక్షణ తీసుకుంది. అదేసమయంలో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించింది. పోటీపడితే వెండి పతకాలతోపాటు ఇప్పటివరకు 15 బంగారు పతకాలు సాధించింది. 2024లో హరియాణాలోని పంచకుల, మధ్యప్రదేశ్‌లోని గాలియానాలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో బ్లాక్‌బెల్ట్‌లో గోల్డ్‌మెడల్ సాధించి ఔరా అనిపించింది. గతేడాది 2024 నవంబరులో కరీంనగర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో బ్లాక్‌బెల్ట్‌లో ఫస్ట్‌డాన్‌గా గోల్డ్ మెడల్ కై వసం చేసుకుంది. ఈఏడాది మే 7 నుంచి 12వతేదీ వరకు మలేషియాలో జరిగే అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభ చూపే అవకాశం దక్కించుకుంది.

అమ్మ ప్రోత్సాహం.. మాస్టర్ కృషి

మా నాన్న మా కుటుంబానికి దూరంగా ఉంటున్నా.. మా అమ్మ కూలీ పనిచేస్తూ అక్క పెళ్లి చేసి, నన్ను చదివిస్తోంది. ఆడపిల్లకు కరాటే పోటీలు అవసరమా అని బంధువులు, ఇరుగుపొరుగువారు సూటిపోటీ మాటలతో ప్రశ్నించేవారు. ఇది మనోవేదనకు దారితీసినా.. కరాటే మాస్టర్ సమ్మయ్య నచ్చజెప్పి మళ్లీ శిక్షణ ఇచ్చారు. ఆడవాళ్లు అంటే కుటుంబానికే పరిమితం కాదనే పట్టుదలతో కరాటేలో రాణిస్తున్నా. మలేషియాలో జరిగే పోటీల్లో మెడల్ సాధించడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నా. నా ప్రతిభ నాలాంటి ఆడపిల్లల కుటుంబాలకు ఆదర్శంగా నిలవాలి.

పరిశోధనలు రైతుకు చేరితేనే సార్థకత!



పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం

- రెండు రోజుల పాటు సాగు సమస్యలపై సదస్సు
- హాజరుకానున్న ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ శాస్త్రవేత్తలు రాత్రింబవళ్లు కష్టపడి పరిశోధనలు చేసి.. అత్యుత్తమ విత్తనాలు తయారు చేసినప్పటికీ వాటి ఫలాలు వివిధ కారణాలతో రైతుల చెంతకు చేరడం లేదు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సమన్వయంతో సాగులో సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చాల్సి ఉన్నా.. ముందుకు కదలడం లేదు. ఈ నేపథ్యంలో సాగులో సమస్యలపై చర్చించేందుకు ఉత్తర తెలంగాణ జోనల్ స్థాయి శాస్త్రవేత్తల సదస్సు పొలాస పరిశోధన స్థానంలో గురువారం ప్రారంభం కానుంది. ఈ సదస్సు రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, 10 జిల్లాల వ్యవసాయాధికారులు పాల్గొననున్నారు.

మూడు ఉమ్మడి జిల్లాలకు కేంద్రం పొలాస

జగిత్యాలలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం మూడు ఉమ్మడి జిల్లాలైన కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు కేంద్రం. ఈ కేంద్రం పరిధిలోనే ఆయా జిల్లాలోని వ్యవసాయ పరిశోధన స్థానాలు, డాట్ సెంటర్లు, కృషి విజ్ఞాన కేంద్రాలు పనిచేస్తాయి. వీటిల్లో దాదాపు 60 నుంచి 70 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు పనిచేస్తుంటారు. పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో వరి, వేరుశనగ, నువ్వు పంటల సాగు విధానాలు, సాగు నీటి యాజమాన్యంపై పరిశోధనలు చేస్తుంటారు. కరీంనగర్ పరిశోధన స్థానంలో మొక్కజొన్న, పెద్దపల్లిలోని కూనారం పరిశోధన స్థానంలో వరి, మొక్కజొన్న పంటలు, ఆదిలాబాద్ పరిశోధన స్థానంలో పత్తి, జొన్న, వరి, సోయాచిక్కుడు, ముథోల్ పరిశోధన స్థానంలో వర్షాధార పత్తి, రుద్రూర్ పరిశోధన స్థానంలో చెరుకు, వరి పంటల సాగు విధానంపై పరిశోధనలు సాగుతుంటాయి. అయితే పరిశోధన ఫలాలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేసేందుకు శాస్త్రవేత్తలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ప్రతి సీజన్‌లో తమ పరిశోధన స్థానాల్లో సాగు చేసిన పంటలను తిలకించేలా ప్రదర్శన క్షేత్రాలు, సాగు సమస్యలు తెలుసుకునేలా కిసాన్ మేళాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ నిధుల కొరతతో ఎప్పుడో ఒకసారి మమ అన్పించేలా జరుగుతుంటాయి.

సమన్వయం అంతంతే..

జిల్లాలోని ఆయా మండలాల్లో పనిచేసే వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల మధ్య సమన్వయం లోపిస్తోంది. కనీసం ప్రతి పంటల సీజన్‌లో నెలకోమారు ఉండేలా సమావేశాలు కనిపించడం లేదు. రైతులకు సాగులో సమస్యలు, సందేహాలు వచ్చినప్పుడు ఎక్కడకు వెళ్లాలో తెలియడం లేదు. రైతులు కొత్త పంటలు సాగు చేద్దామనుకున్నా.. ఏ పంట విత్తనం ఎక్కడ దొరుకుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. క్షేత్రస్థాయిలో రైతులు పొలాలను సందర్శించేందుకు వెళ్లినప్పుడు వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండటం లేదు. వ్యవసాయాధికారులు ఏదైనా సమస్యపై శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సకాలంలో క్షేత్ర సందర్శనకు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రైతులు శాస్త్రవేత్తలు, అధికారుల చుట్టూ తిరగలేక ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఫర్టిలైజర్ దుకాణాలను ఆశ్రయించి వారు ఇచ్చిన మందులు పిచికారీ చేస్తున్నారు.

పొలాలకు చేరని పరిశోధనలు

శాస్త్రవేత్తల పరిశోధనలు రైతుల చెంతకు చేరడం లేదు. శాస్త్రవేత్తలు శ్రమటోడ్చి రూపొందించిన విత్తనాలను రైతులు ఆదరిస్తుంటే.. కొన్ని రకాల విత్తనాల విషయమే రైతులకు తెలియని పరిస్థితి ఉంది. రైతులు ఏం కావాలనుకుంటున్నారు..? ఎలాంటి పరిశోధనలు చేస్తే రైతులకు ఉపయోగం ఉంటుందనే విషయాలపై ఆలోచించకుండా.. మూస ధోరణిలో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పరిశోధనలు చేస్తున్నారు. రైతులు ప్రధానంగా కూలీలు, మార్కెటింగ్ సమస్యను ఎదుర్కొంటున్నారు, వాతావరణ మార్పులతో పంటల్లో తెగుళ్లు, పురుగుల విజృంభన ఎక్కువవుతుంది. ప్రతి సీజన్‌లో అధిక దిగుబడినిచ్చే విత్తనాల కోసం రైతులు వెతుకులాడుతున్నారు. ప్రైవేట్ విత్తన కంపెనీలు రకరకాల పేర్లతో విత్తనాలు తయారు చేసి రైతులకు విక్రయిస్తుంటే.. నిధుల కొరతతో అనుకున్న స్థాయిలో పరిశోధన స్థానాల్లో విత్తనోత్పత్తి జరగడం లేదు.


రైతల కోసం పరిశోధనలు చేయాలి



శాస్త్రవేత్తలు మూస ధోరణిలో కాకుండా రైతులకు అవసరమైన పరిశోధనలు చేసి అభిమానాన్ని చూరగొనాలి. వరి పంటకు ప్రత్యామ్నాయ పంటలు, కోతుల సమస్యపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. వాతావరణ మార్పులు రైతులకు పెద్ద సమస్యగా మారింది. వాటిపై పరిశోధనలు చేయాలి.

– సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉత్తమ రైతు, నాగారం, ధర్మపురి మండలం

రైతుల ఆదాయం పెరిగేలా..



రైతుల ఆదాయం పెరిగేలా శాస్త్రవేత్తల పరిశోధనలు సాగాలి. సాగులోని సమస్యలను ఎప్పటికప్పుడు రైతులతో చర్చించాలి. సాగులో వస్తున్న సమస్యలు రైతులకు సవాల్ విసురుతున్నాయి. నామమాత్రంగా సమావేశాలు నిర్వహించడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు.

– వెల్ముల రాంరెడ్డి, వ్యవసాయ వర్సిటీ సలహా మండలి మాజీ సభ్యుడు, పూడూరు



పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న నువ్వు పంట

క్లుప్తంగా

హంస వాహనంపై ఊరేగింపు



వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న శ్రీరామ నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సీతారామచంద్ర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అందంగా అలంకరించిన పెద్ద సేవపై హంస వాహనంపై ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, పురప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అర్చకులు

జాతీయ ఖోఖో పోటీలకు కోచ్‌లుగా ఉమ్మడి జిల్లావాసులు



నరేశ్



ఆనంద్

కరీంనగర్‌స్పోర్ట్స్: ఒడిశా రాష్ట్రంలోని పూరిలో ఈనెల 4వ తేదీ వరకు జరుగనున్న 57వ సీనియర్స్ జాతీయ ఖోఖో పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్లకు ఉమ్మడి జిల్లాకు చెందిన పందుగ ఆనంద్ కుమార్, ఇస్లావత్ నరేష్ కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర పురుషుల జట్టుకు ఇల్లంతకుంటకు చెందిన రైల్వే క్రీడాకారుడు పూర్వ భారత జట్టు కెప్టెన్ పందుగ ఆనంద్, జాతీయ పోటీల్లో పాల్గొంటున్న భారత పురుషుల రైల్వే జట్టుకు ధర్మారం మండలం బంజరుపల్లి తండాకు చెందిన దక్షిణ మధ్య రైల్వే క్రీడాకారుడు ఇస్లావత్ నరేశ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.మహేందర్ రావు తెలిపారు. వీరిని సంఘ బాధ్యులు చిట్టి తిరుపతిరెడ్డి, కుమారస్వామి, ఏ.రవీందర్, లక్ష్మణ్, ఎస్కే మోహినుద్దీన్, సీఐ కుమారస్వామి, ఎస్సై రమేశ్, బి.శేఖర్, నవీన్, ఆర్.తిరుపతిరెడ్డి అభినందించారు.

కారు ఢీకొని విద్యార్థులకు గాయాలు



తీవ్ర గాయాలైన విద్యార్థి

ధర్మపురి: కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్న ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ధర్మపురికి చెందిన సంతోష్ బుధవారం సాయంత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నాడు. అదే సమయంలో మైదానంలో మహాత్మ జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాల విద్యార్థులు కూర్మాదాస్, వినయ్ వాకింగ్ చేస్తున్నారు. కారు అదుపు తప్పి వీరిని ఢీకొట్టింది. ప్రహరీ, కారు మధ్యలో విద్యార్థులు ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పరిశ్రమలకు అనుమతి వద్దా?

- ఎన్టీపీసీకి బల్దియా భారీ జరిమానా

కోల్‌సిటీ(రామగుండం): మున్సిపల్ చట్టం ప్రకారం అనుమతి లేకుండా ఎవరూ నిర్మాణాలు చేపట్టరాదు. కానీ రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్‌ఎఫ్‌సీఎల్ సంస్థలు ఇష్టం వచ్చిన రీతిలో క్వార్టర్లు, కార్యాలయ భవనాలు, కొత్త యూనిట్లు నిర్మిస్తున్నా అనుమతి కోసం బల్దియాను సంప్రదించలేదని ఆరోపణలు వస్తున్నాయి. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని బల్దియా చేసే ప్రకటనకు ప్రైవేట్ సంస్థలు/వ్యక్తులు స్పందిస్తున్నా.. ప్రభుత్వ రంగ సంస్థలు పట్టించుకోవడంలేదు. నోటీసులు జారీ అవుతున్నా బేఖాతరు చేస్తూ వస్తున్నాయి.

25ఏళ్ల క్రితం సోమారపు పోరాటం..

పరిశ్రమలు పర్యావరణ విధ్వంసం చేస్తున్నందున నిర్మాణ రుసుంతోపాటు తమ ప్రాజెక్ట్ యూనిట్ వ్యయంలో కనీసం ఒకశాతం ఎన్విరాన్మెంట్ ఇంపాక్ట్ ఫీ కూడా మున్సిపాలిటీకి చెల్లించాలని రామగుండం మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు సోమారపు సత్యనారాయణ 25ఏళ్ల క్రితం పోరాడారు. కానీ పరిశ్రమలు ఈ రుసుం చెల్లించడానికి ముందుకు రాలేదు. ఆస్తిపన్ను తప్ప మరే ఇతర ఫీజు ప్రభుత్వ రంగ సంస్థలు చెల్లించడంలేదు. అడపాదడపా సీఎస్‌ఆర్ నిధులు మంజూరు చేసినా ప్రభావిత ప్రాంతం కన్నా మరేప్రాంతాలకు కేటాయించడంలేదు. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ పరిశ్రమలపై ఒత్తిడి పెరుగుతున్నది.

ఒత్తిడి తెస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్..

స్థానిక వనరులను ఇబ్బడిముబ్బడిగా ఉపయోగించుకుంటూ, ప్రభావిత ప్రాంతాలను పరిశ్రమలు పట్టించుకోవడం లేదని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ బహిరంగంగానే విమర్శలు చేయడంతోపాటు సింగరేణి సంస్థపై ఒత్తిడి తెచ్చి అనేక అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీపై కూడా ఒత్తిడి తెచ్చి చట్టబద్ధంగా బల్దియాకు రుసుం రాబట్టాలని యోచించారు. అనుమతి లేని కట్టడాలకు జరిమానా విధిస్తూ నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ ఇటీవల నోటీసులు జారీచేశారు. ఈక్రమంలోనే ఎన్టీపీసీ సంస్థ అనుమతి లేకుండా నిర్మించిన ఆరు భవనాలకు రూ.99.28 కోట్ల వరకు జరిమానా విధిస్తూ నోటీసులు జారీచేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్



ఓదెల(పెద్దపల్లి): నేరాల నియంత్రణ కోసం పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశించారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం రాత్రి సీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఠాణా పరిసరాలు, కేసులు, సీజ్ చేసిన వాహనాలు తదితర వాటిపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. సమస్యాత్మక గ్రామాలు, అజ్ఞాతంలోని మావోయిస్టుల వివరాల గురించి ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, అనుమానితుల స్థితిగతులు, కదలికలపైనా ఆరా తీశారు. మత్తు పదార్థాలను తయారు చేస్తున్న, నిల్వచేస్తున్న, రవాణా చేస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎస్సై రమేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లిరూరల్: యాసంగి ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. హమాలీల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలం గుర్తించాలని, కేటాయించిన రైస్ మిల్లులకే ధాన్యం తరలించాలని ఆయన సూచించారు. కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయాలని అన్నారు. నాణ్యతా ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రేడ్- ఏ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర చెల్లిస్తామని ఆయన తెలిపారు. ఈసారి 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనేది తమ లక్ష్యమని కలెక్టర్ వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 24 గంటల్లో మిల్లులకు తరలించేలా వాహనాలు సిద్ధం చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, అకాల వర్షాల నుంచి పంటను కాపాడేందుకు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు

కమాన్‌పూర్(మంథని): మంథని నియోజకర్గంలోని పంటలు ఎండిపోకుండా చివరి ఆయకట్టుకు వరకు సాగునీరు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎస్సారెస్పీ అధికారులను ఆదేశించారు. రంగాపూర్ ఎస్సారెస్పీ డీ–83 కాలువతోపాటు గుండారం రిజర్వాయర్ నుంచి రామగిరి, ముత్తారం, మంథని పరిధిలోని పంటలకు సాగునీరు అందించే ఆర్‌ఎస్‌బీ కెనాల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఎస్సారెస్పీ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్‌ఈ సత్యరాజ్‌చంద్ర, అధికారులు శ్రీనివాస్, బలరామయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌యూసీసీ ప్రతినిధి నియామకం



అనుమాస శ్రీనివాస్

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాకు చెందిన అనుమాస శ్రీనివాస్‌ను దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(డీఆర్‌యూసీసీ) ప్రతినిధిగా నియమించారు. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరవింద్‌కుమార్ జైన్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ 2026 ఆగస్టు వరకు ఈ పదవిలో ఉంటారని పేర్కొన్నారు.

నస్పూర్ పాలిటెక్నిక్‌లో 50 శాతం సీట్లు

గోదావరిఖని: పదోతరగతి పూర్తిచేసిన సింగరేణి ఉద్యోగుల పిల్లలకు నస్పూర్ పాలిటెక్నిక్‌లో 50 సీట్లు కేటాయించనున్నట్లు ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. మెరిట్ ప్రాతిపదికన ఇతరులకూ సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. డిప్లొమా ఇన్ సివిల్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, డిప్లొమా ఇన్ మెకానికల్, డిప్లొమా ఇన్ మైనింగ్ ఇంజినీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు జీఎం లలిత్‌కుమార్ వెల్లడించారు. బాల, బాలికలకు వేర్వేరుగా హాస్టల్ వసతి ఉన్నట్లు తెలిపారు. అలాగే ఆర్జీ–1 సింగరేణి పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి కొత్తగూడెంలోని మహిళా జూనియర్, మహిళా డిగ్రీ, పీజీ కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ కోర్సులు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఆసక్తి గలవారు స్థానిక సింగరేణి హైస్కూల్ సెక్టార్–2 ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ 94908 82498, లేదా స్వర్ణలత టీచర్ 98497 72512 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగింపు

పెద్దపల్లిరూరల్: ఎల్‌ఆర్‌ఎస్ గడువును ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగించిందని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ బుధవారం తెలిపారు. లే అవుట్ లేని ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తమ ప్లాట్లను 25శాతం రాయితీ ఫీజుతో క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఇందుకోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని వివరించారు. అదేవిధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను చెల్లించేవారికి ఐదుశాతం రాయితీ వర్తింపజేస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.